సాక్షి
నిర్మల్
గురువారం । 20 । జూలై । 2023



నాణ్యమైన విద్య అందించాలి
'ఆశ్రమ' విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. మెరుగైన వసతులు కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. 8లో▸



ముగిసిన ట్రిపుల్‌ఐటీ కౌన్సెలింగ్
బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ ముగిసింది. బుధవారం అధికారులు విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
26.0 /23.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయి.

న్యూస్‌రీల్

స్థలం మంజూరు చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో బిల్డింగ్ పెయింటర్స్ అసోసియేషన్ సంఘ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి పెయింటర్లు వినతిపత్రం అందించారు. అధ్యక్షుడు రాజుల రమేశ్, నాయకులు కత్తెరపాక శంకర్, కుమార స్వామి, వినోద్, అజయ్‌కుమార్, విక్రమ్, సుధాకర్, సాయన్న, రజాక్ తదితరులున్నారు.

దరఖాస్తు చేసుకోవాలి
నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని వైద్యారోగ్యశాఖ పరిధిలోగల జాతీయ ఆరోగ్య మిషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పీడియాట్రిషన్-1, సైకాలజిస్ట్-1 పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి సీహెచ్ ధన్‌రాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులు www.nirmal.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుఫాంలు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుకు సంబంధిత అర్హత పత్రాలు జతచేసి జిల్లా కార్యాలయంలో ఈనెల 24వ తేదీలోపు అందించాలని సూచించారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 52 గెస్ట్ లెక్చరర్ పోస్టుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి జాదవ్ పరశురాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులపై గజిటెడ్ సంతకంతో దరఖాస్తులు అందించాలని సూచించారు. తెలుగు, ఆంగ్ల మధ్యమాల్లో 31 ఖాళీలు, ఉర్దూ మాధ్యమంలో 18 ఖాళీలు, మరాఠీ మాధ్యమంలో 7 ఖాళీలు, వొకేషనల్‌లో 2 ఖాళీలు ఉన్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'విద్యారంగం నిర్వీర్యానికి కుట్ర'
నిర్మల్ ఖిల్లా: విద్యారంగం నిర్వీర్యానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రి కేటీఆర్ అక్కడి విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నిర్మల్ ప్రభుత్వ పీజీ కళాశాలలో కోర్సులు ఎత్తివేసే కుట్ర జరుగుతోందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి శీతల్కర్ అరవింద్, ఉపాధ్యక్షుడు నవీన్, ముధోల్ డివిజన్ కార్యదర్శి పరమేశ్వర్, నాయకులు ప్రతాప్, రజిత, నవీన, ఉదయ్, లకన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఖానాపూర్: ఆదివాసి బీర్ధగోండ్ (తోటి) సేవా సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసీ బీర్ధగోండ్(తోటి) యువసేన సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ నాయకుడు పెండోర్ దత్తు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్మల్ జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా తొడసం గోవర్ధన్, గౌరవాధ్యక్షులుగా మెస్రం బాపురావు, ప్రధాన కార్యదర్శిగా కుర్సెంగా సత్యం, ఉపాధ్యక్షుడిగా ఆత్రం భీందాస్, సహాయ కార్యదర్శిగా మాడవి ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాహకటి వెంకటేశ్, సలహాదారుగా చాహకటి జైవంత్‌రావ్, మహిళా సంఘం సభ్యులుగా కుంరం తులసి, ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, అసెంబ్లీ ఐటీ సోషల్ మీడియా కన్వీనర్ నల్లూరి శ్రీధర్, జిల్లా నాయకులు వడ్లకొండ రాజేశ్వర్‌గౌడ్ తదితరులు శాలువాలతో సన్మానించారు. ఉమ్మడి జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి కాత్లే బుచ్చన్న తదితరులున్నారు.

అంతా.. గుంతలమయం

- జిల్లాకేంద్రంలో 'చిత్తడి'దారులు
- ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి
- వానాకాలం రెట్టింపు అవస్థలు
- ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు



గాంధీచౌక్‌లో రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు

నిర్మల్: 'ఏయ్ ఆటో.. బంగల్‌పేటకు అస్తవా..!' అంటూ చేతిలో సంచిపట్టుకుని నర్సవ్వ అడగటం మధ్యలో ఉండగానే, 'బంగల్‌పేటకా.. రానురానమ్మా..' అంటూ ఆటోడ్రైవర్ తల అడ్డం ఊపుతూ రయ్‌మని వెళ్లిపోయాడు. అలా ఒకట్రెండు ఆటోల వాళ్లూ రామని సమాధానమిచ్చారు. మరో ఆటో దగ్గరికి వెళ్లి నర్సవ్వ 'బిడ్డ నాక్కొంచెం మోకాళ్ల నొప్పులున్నయ్. అంతదూరం నడవలేను. బంగల్‌పేటల నా బిడ్డ ఉంటది. జరంత.. నువ్వన్న దించేయ్ బిడ్డా పుణ్యముంటది..' అని దీనంగా అడగగా.. 'అటు రోడ్లు సక్కగ లేవమ్మ. బుధవార్‌పేటకెళ్లి మొదలువెడితే బంగల్‌పేట్ దాకా అడుగడుగున గుంతలున్నయ్.. అందుకే అటు సైడు పోయేతందుకు ఆటోవాళ్లు ఇష్టపడతలేరు. నీకు మోకాళ్ల నొప్పి ఉందంటున్నవ్‌గదా. నేను దించేస్తరా. కానీ.. ఓ పదిరూపాయలు ఎక్కువియ్యాలె మరి..' అంటూ నర్సవ్వను ఆటో ఎక్కించుకున్నాడు. బుధవార్‌పేట్ శివకోటిమందిరం-కబూతర్‌కమాన్ దగ్గరికి రాగానే.. 'ఓ బిడ్డ జరంత మెల్లంగపోని. పాణమంత కూట్‌కూట్ అయితుంది..' అని నర్సవ్వ అంటుండగనే, 'అమ్మా.. ముందే చెప్పిన్నా లేదా.. ఈ రోడ్డంతా గిట్లనే ఉంటది..' అని డ్రైవర్ చెప్పడంతో, 'అయ్యో దేవుడా.. ఈ రోడ్లతోటి ఉన్న బొక్కలన్నీ అరిగేటట్లున్నయ్..' అని నర్సవ్వ వాపోయింది.

ఈ కష్టం.. ఈ ఒక్కరోజు, ఈ ఒక్క నర్సవ్వకే కాదు. జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ చుట్టూ ఉన్న ఆయా వీధుల ప్రజలంతా నిత్యం అనుభవిస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా గుంతలరోడ్లతో నరకం చూస్తున్నారు. చాలామంది డిస్క్ సమస్యలు, డస్ట్ ఎలర్జీల బారినపడ్డారు. పాత ఏరియాతో పాటు జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఇవే సమస్యలతో స్థానికులు నిత్యం సతమతమవుతున్నారు.

మూడేళ్లుగా నరకం..

జిల్లాకేంద్రంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టి దాదాపు మూడేళ్లవుతోంది. స్థానిక చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్ వరకు గల అంతర్గత ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టారు. ప్రారంభంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులంతా నిలబడి మరీ.. ఇళ్లు, దుకాణాలు తొలగింపజేశారు. తాము నష్టపోయినా.. అందరికీ మంచే జరుగుతుందని స్థానికులు ఓర్చుకున్నారు. కానీ.. ఏళ్లు గడుస్తున్నా రోడ్డు పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. చైన్‌గేట్ నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకే రోడ్డు వేశారు. అక్కడి నుంచి సోమవార్‌పేట్, గాంధీచౌక్, జుమ్మెరాత్‌పేట్, నాయుడివాడ, బేస్తవార్‌పేట్, బంగల్‌పేట్ వరకు రోడ్డు మొత్తం గుంతలతో అలాగే ఉంది. డ్రైనేజీలను పూర్తిగా నిర్మించకపోవడంతో మురికినీళ్లు రోడ్లపైకి వస్తున్నాయి. గత రెండు పర్యాయాలు వినాయక నవరాత్రుల సమయంలో పైపై మట్టిపోసి పండుగకు మమ అనిపించారు. మళ్లీ రోడ్లను యథావిధిగా గాలికొదిలేశారు. దీంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడంలేదు.

అనారోగ్య సమస్యలు..
- 'ఏం రోడ్లు సార్ ఇవి.. ఏళ్ల నుంచి ఇట్లనే గాలికి వదిలిపెట్టారు. రోజూ ఈ రోడ్డుమీది కెళ్లి పోవుడుకి నాకు మెడ నొప్పి వచ్చింది. డాక్టర్ల దగ్గరికి వెళ్తే రూ.రెండువేల దాకా ఖర్చయ్యింది. మెడ భాగంలో బొక్క అరుగుతుందని చెప్పారు. ఇంత దారుణం ఉంటదా సార్..' అని బేస్తవార్‌పేటకు చెందిన ఓ వ్యాపారి వాపోయారు.
- 'ఇప్పుడంటే వర్షాలతో గుంతల సమస్యలే కనిపిస్తున్నాయి. మామూలు రోజుల్లో దీనికి అదనంగా దుమ్మూధూళి విపరీతంగా ఉంటుంది. మూడునెలల క్రితం తరచూ తుమ్ములు వస్తుండటంతో చెక్ చేయించుకుంటే డస్ట్ ఎలర్జీ ఉందని డాక్టర్ చెప్పారు. చిన్నప్పటి నుంచి లేని సమస్య ఈ రోడ్డుతోనే వచ్చింది.' అంటూ బంగల్‌పేటకు చెందిన ఓ యువకుడు ఆవేదన వ్యక్తంచేశాడు.

ఇలా ఒకరిద్దరే కాదు.. రోడ్డుపనులు పెండింగ్‌లో ఉండడంతో ఏర్పడ్డ అవస్థలతో చాలామంది అనారోగ్య సమస్యల బారినపడ్డట్లు పేర్కొంటున్నారు. గర్భిణులు, బాలింతలను తీసుకుపోవడం కూడా కష్టంగా ఉందని చెబుతున్నారు.

సోషల్ మీడియాలో..
జిల్లాకేంద్రంలోని పాత ఏరియాలోని వీధుల ప్రజలే కాకుండా అనంతపేట్, నీలాయిపేట్, మేడిపల్లి, ఎల్లారెడ్డిపేట్ గ్రామాలకు వెళ్లేవారూ గాంధీచౌక్ మీదుగానే వెళ్తారు. రోడ్లు బాగాలేకపోవడంతో ప్యాసింజర్ ఆటోలూ ఈ మార్గంలో వెళ్లడం లేదు. చుట్టూ తిరిగి విశ్వనాథ్‌పేట్, బంగల్‌చెరువు కట్ట పైనుంచి వెళ్తున్నాయి. లోకల్ ఆటోలూ ఈ ఏరియాకు రావడానికి ఇష్టం చూపడం లేదు. ఇక నిత్యం తాము ఈ దారితో పడుతున్న కష్టాలనూ స్థానిక యువకులు కొంతకాలంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. వర్షాలతో మరింత అధ్వానంగా తయారైన రోడ్లను వీడియోల రూపంలో కళ్లకు కట్టిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక కౌన్సిలర్లు స్పందించాలని, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

వర్షాలతో మరింత..

అక్కడ, ఇక్కడా అని కాదు.. జిల్లాకేంద్రం మొత్తం అంతర్గత రోడ్లు దారుణంగా మారాయి. వర్షంతో మరింత చుక్కలు చూపిస్తున్నాయి. ప్రియదర్శినినగర్, భాగ్యనగర్, ఈద్‌గాం, బాగులవాడ, ద్యాగవాడ, బుధవార్‌పేట్ తదితర కాలనీల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దాదాపు మూడేళ్లుగా రోడ్డువెడల్పు పేరిట పనులు పెండింగ్‌లో ఉన్న ఏరియాల్లో పరిస్థితి ప్రత్యక్ష నరకంగా మారింది. ఇటీవల కురుస్తున్న వానలకు గుంతలు మరింత పెద్దగా మారాయి. పోస్టాఫీస్ దిగుడు నుంచి అదే పరిస్థితి. బుధవార్‌పేట్ నుంచి గాంధీచౌక్ వైపు వచ్చే రోడ్డయితే మరీ దారుణం. ఒకట్రెండు చోట్ల అడుగు లోతున్న గుంతలు ప్రమాదకరంగా మారాయి.



శివకోటి మందిరం-కబుతర్‌కమాన్ మధ్యలో..



నాయిడివాడ చౌరస్తా-బంగల్‌పేట్ వెళ్లే దారిలో..



బంగల్‌పేట్ ప్రధానరోడ్డులో..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సబ్బుల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. వాతావరణశాఖ జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించిన నేపథ్యంలో ధన, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులు వారి పరిధిలోని చెరువులు, కుంటలు, నీటి వనరులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వాగులు, కల్వర్టుల వద్ద ప్రవాహం అధికమైతే రాకపోకలను నిలిపివేయాలని పేర్కొన్నారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని, లోతట్టు, ముంపు ప్రదేశాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 9398749227 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగించుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవన కార్యాలయాలను తొలగించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. వైకుంఠధామ నిర్మాణ పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సోఫీనగర్‌లోని విజయ డెయిరీ, చుట్టు పక్కల ఖాళీ ప్రదేశాలను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సబ్బుల తయారీ, తేనెశుద్ధి కర్మాగారాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పలుశాఖల జిల్లా స్థాయి అధికారులున్నారు.

నిధులు మంజూరు చేయాలి
మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సంఘం సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. నాయకులు లింగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, అశోక్, రాజేశ్వర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వోళ్ల లింగమయ్య, వార్డు మెంబర్ మూగల రత్నయ్య తదితరులున్నారు.

తెరిపినివ్వని ముసురు



భైంసా: బాసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- నిండుతున్న కుంటలు
- వాగులు, చెరువులకు జలకళ
- ప్రాజెక్టులకు స్వల్ప ఇన్‌ఫ్లో



కుంటాల: లింబా(బీ)లో కూలిన కొత్తచెరువు అలుగు

భైంసాటౌన్/కడెం/భైంసా: జిల్లావ్యాప్తంగా ముసురు పడుతోంది. మంగళవారం మొదలై బుధవారం మధ్యాహ్నం వరకు రోజంతా వాన కురుస్తూనే ఉంది. పలుచోట్ల కుంటలు నిండాయి. వాగులు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. దాదాపు అన్ని ప్రాజెక్టుల్లోకి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగింది. మంగళవారం జిల్లావ్యాప్తంగా సరాసరి 55మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అధికంగా దిలావర్‌పూర్ మండలంలో 79.4 మి.మీటర్లు, మామడలో 28.2 మి.మీటర్ల వర్షం కురిసింది.

గడ్డెన్నవాగుకు స్వల్ప ఇన్‌ఫ్లో

భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో ఉంది. ఎగువన కురిసిన వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వస్తోంది. మంగళవారం కురిసిన వర్షానికి 1,724 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్ట్‌లోకి చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 357 మీటర్ల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

'కడెం' వరద గేటు ఎత్తివేత

కడెం ప్రాజెక్టుకు బుధవారం 8,696 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు తొమ్మిదో నంబర్ వరద గేటు ఎత్తి 2,865 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 (7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 690.700 (5.407టీఎంసీ) అడుగులున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూలై చివరి దాకా 690 అడుగుల నీటిమట్టం మెయింటేన్ చేస్తామని ఇన్‌చార్జి ఈఈ విఠల్, డీఈ బోజదాసు, ఏఈఈలు రవినాయక్, గణేశ్ ఈ సందర్భంగా తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు బుధవారం గోదావరినది ఉధృతంగా ప్రవహించింది. మహారాష్ట్రలోనూ వర్షాలు కురియగా వరదనీరు కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొద్దికొద్దిగా నీటి మట్టం పెరిగింది. సాయంత్రం బాసర వద్ద గోదావరి రెండు వంతెనలను ఆనుకుని ప్రవహించింది. మరో రెండ్రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలుపడంతో నీటి ప్రవాహం మరింతగా పెరిగే అవకాశముంది.

మండలాల వారీగా వర్షపాతం

మండలం	వర్షపాతం(మి.మీ.)
కుభీర్	67.8
తానూరు	76.2
బాసర	56.4
ముధోల్	65.8
భైంసా	72.8
కుంటాల	72.4
నర్సాపూర్ (జీ)	72.2
లోకేశ్వరం	68.2
దిలావర్‌పూర్	79.4
సారంగపూర్	53.8
నిర్మల్	52.4
నిర్మల్‌రూరల్	44.2
సోన్	44.4
లక్ష్మణచాంద	45.4
మామడ	28.2
పెంబి	37.4
ఖానాపూర్	31.6
కడెం	40.6
దస్తురాబాద్	36.2

రైతులకు అండగా నిలుస్తున్న కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సోన్: రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు మంత్రి అల్లోల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అని అన్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి రైతుల కష్టాలు తెలియవని, అవగాహన రాహిత్యంతోనే ఉచిత విద్యుత్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రైతు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించారని చెప్పారు. అనంతరం 24గంటల ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం కేజీబీవీ ప్రహరీ, మినీ పీహెచ్‌సీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ జీవన్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మొహినొద్దీన్, సీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, శానం గంగాధర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను తరిమికొడదాం

దస్తురాబాద్: రైతు వ్యతిరేక కాంగ్రెస్‌ను తరిమికొడదామని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక పంటలు ఎండాయని ఆరోపించారు. ప్రస్తుతం మిగులు విద్యుత్ సాధించి తెలంగాణ రైతాంగానికి 24గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అనడం సరికాదన్నారు. అనంతరం మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు సంతోష్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యాయాదవ్, రాజనర్సయ్య, నాయకులు రమేశ్‌రావ్, శ్రీనివాస్, సత్యం, రాజలింగం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఖానాపూర్: సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడంతో పాటు వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు జాదవ్ వెంకట్రావ్ కోరారు. బుధవారం పట్టణంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రెండో పీఆర్సీని ప్రకటించాలని కోరారు. జూలై 1 నుంచి మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపించారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, ఉపాధ్యాయులు మురళీధర్, రాజశేఖర్, ఫాజిల్, ప్రేమ్‌సింగ్ తదితరులున్నారు.

వర్షపునీటిని ఒడిసిపట్టాలి
నర్సాపూర్(జి): వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచేలా ఇంటింటా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో బుధవారం ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గ్రామస్తులు ఇంకుడుగుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో వర్షపునీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడుగుంతలు నిర్మించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఏపీవో సుగుణ, టెక్నికల్ అసిస్టెంట్లు రవీందర్, సతీశ్ తదితరులున్నారు.

పాత పెన్షన్ విధానంతోనే ఆర్థిక, సామాజిక భద్రత

పెంబి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించినపుడే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక, సామాజిక భద్రత చేకూరుతుందని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు మందపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సీపీఎస్ రద్దుకు చేపట్టిన పోరాట ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 24వ తేదీన జిల్లా కేంద్రంలో రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరై రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



షేక్ ఇర్ఫాన్(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన యువకుడు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. ఎస్సై భరత్‌సుమన్ వివరాల ప్రకారం.. షేక్ ఇర్ఫాన్ (25) మంగళవారం ఉదయం నుంచి కనబడకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి చెరువు వద్ద చెప్పులు కనిపించడంతో చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బుధవారం తెలిపారు. ఇర్ఫాన్‌కు భార్య గౌసియా, బాబు ఉన్నాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ మృతదేహాన్ని పరిశీలించి ప్రగాఢసానుభూతి తెలియచేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తానూరు: మండలంలోని బోంద్రట్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బెల్‌తరోడ గ్రామానికి చెందిన శ్యాంరావు కాలినడకన బోంద్రట్ నుంచి బెల్‌తరోడ గ్రామానికి వస్తున్నాడు. మహారాష్ట్రలోని లగుళద్ గ్రామానికి చెందిన బాలు ద్విచక్రవాహనంపై భైంసా నుంచి భోకర్‌వైపు వెళ్తున్నాడు. బోంద్రట్ గ్రామ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న శ్యాంరావును బాలు ద్విచక్రవాహనంతో ఢీని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన శ్యాంరావు, బాలును స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

స్వల్పంగా పెరిగిన మత్తడి వాగు నీటిమట్టం



ప్రాజెక్టులో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం

తాంసి: వరుసగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వడ్డాడి సమీపంలో మత్తడివాగు ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి వచ్చిన వరదనీరు ప్రాజెక్టులోకి నీటిమట్టం స్వల్పంగా పెరుగనుంది. ఎగువన కురిసిన వర్షాలతో బుధవారం ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. వరదనీరు స్వల్పంగా చేరడంతో ప్రాజెక్టులో నీటిమట్టం 275 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 275 మీటర్లు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ హరీష్ కుమార్ తెలిపారు.

గోడకూలి ఒకరికి గాయాలు

సిరికొండ: కొన్నిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని లక్ష్మీపూర్(కే) గ్రామానికి చెందిన కరాటే కైలాస్‌కు చెందిన ఇంటిగోడ మంగళవారం రాత్రి కూలింది. గోడ పైన పడడంతో కైలాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అతడి వెంట భార్య, పిల్లలు కూడా అదే ఇంట్లో నిద్రిస్తుండగా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రస్తుతం కై లాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గెస్ట్ లెక్చరర్ల నిరసన



నిరసన తెలుపుతున్న గెస్ట్ లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని తెలంగాణ గెస్ట్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణు యాదవ్ మాట్లాడుతూ రెగ్యులర్ లెక్చరర్లతో సమానంగా విధులు నిర్వహించినప్పటికీ తమను తొలగించి కొత్తవారిని నియమించడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం సరి కాదని మండిపడ్డారు. పదేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ కమిషనర్ నవీన్ మిత్తల్ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఆ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజేందర్, యాఖుబ్ పాషా, మధుసూదన్ పాల్గొన్నారు.

ఏళ్లుగా ఇదే గోస



ఈ ఫొటోలో కనిపిస్తున్న గ్రామం అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్ను మారుతిగూడ. ఈ గ్రామం మూడేళ్ల కిందట ఏర్పడింది. ఇక్కడ 12గృహాలు ఉండగా 50 నుంచి 60 మంది నివసిస్తున్నారు. ఈ గ్రామానికి 300 మీటర్ల దూరంలోని బీటీ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు సౌకర్యం లేక గత ఏడాది వర్షాకాలంలో గ్రామస్తులు బురదలో ఇద్దరు గర్భిణులను మంచంపై బీటీ రోడ్డు వరకు తీసుకువెళ్లిన దుస్థితి. ఈ గ్రామంలో పాఠశాల లేక విద్యార్థులు కాలినడకన 500మీటర్ల దూరంలోని పాఠశాలకు వెళ్తున్నారు. ఈ పరిస్థితి కేవలం చిన్ను మారుతిగూడది మాత్రమే కాదు. మిగితా గ్రామాల పరిస్థితి ఇదే..



చిన్ను మారుతిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు..

- సమస్యల్లో అంకాపూర్, ఆరు అనుబంధ గ్రామాలు..
- గ్రామాల్లో కనిపించని కనీస సౌకర్యాలు
- కానరాని రోడ్లు.. డ్రైనేజీ లేక దారులపై మురుగు
- తాగునీటికి తప్పని కష్టాలు..
- వారానికోసారి భగీరథ నీరు..
- అనారోగ్యాల బారిన గిరిజనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గ్రామంలో నిరుపయోగంగా వాటర్ ట్యాంక్



కాలినడకన బాలింతను తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా... నేటికి పలు గిరిజన గ్రామాల ప్రజలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. దీనికి ఉదాహరణే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో దొండరిగూడ, రాములుగూడ, పెద్దపందిర్‌లొద్దీ, చిన్న పందిర్‌లొద్దీ, చిన్ను మారుతిగూడ, కొలాంగూడ గ్రామాలున్నాయి. అనుబంధ గ్రామాలను కలుపుకొని ఈ పంచాయతీ పరిధిలో 257 గృహాలు ఉండగా 2011 జనాభా లెక్కాల ప్రకారం 917జనాభా ఉంది. ఆయా గ్రామాల్లో కనీస మౌలిక వసతులైన సీసీ రోడ్డు, మురికి కాలువలు లేవు. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో పాటు మురుగునీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. తమ గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని పలువురు యువకులు ఇటీవల ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లారు.

సరఫరా కానీ మిషన్ భగీరథ నీరు..

పైపుల లీకేజీలతో గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు వారం, పదిరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ఎప్పుడో ఓసారి నీరు సరఫరా అవుతున్నప్పటికీ అవి కూడా కలుషిత నీరే వస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే చిన్ను మారుతి గూడ గ్రామానికి మిషన్ భగీరథ పైపులైన్ లేక వారు వారి గ్రామానికి కొన్ని మీటర్ల దూరంలోని చిన్న పందిరల్‌లొద్దీ గ్రామం నుంచి నల్లా పైపు ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. గ్రామంలో కనీసం చేతి పంపు కూడా లేక చిన్న పందిర్‌లొద్దీ గ్రామంలోని చేతి పంపు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే ఏటా వర్షాకాలంలో బురదరోడ్లపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు లేక చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదు.

సొంత నిధులతో విద్యుత్ ఏర్పాటు

కొన్ని గ్రామాలకు ప్రభుత్వం విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో గ్రామస్తులు ఇంటికి కొంత చందాలు వసూలు చేసి విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ కొనుగోలు చేసుకోని విద్యుత్ సౌకర్యం కల్పించుకున్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేక పలు గ్రామాలు రాత్రి అందకారంలో ఉంటున్నాయని వాపోతున్నారు.

అవస్థలు పడుతున్నాం



మా గ్రామంలోకి రోడ్డు సౌకర్యం లేదు. వర్షాకాలంలో రోడ్డంతా బురదగా ఉంటుంది. కాలినడకనే గ్రామానికి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నాం. గ్రామంలోకి వాహనాలు వెళ్లే సౌకర్యం లేదు. మా గ్రామానికి కొన్ని మీటర్ల దూరంలో ఉన్న బీటీ రోడ్డు పక్కనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నాం.

– రాము, గ్రామస్తుడు, చిన్ను మారుతి గూడ

మంచాలపై తీసుకెళ్లినాం



తమ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. గత ఏడాది వర్ష కాలంలో ఇద్దరు గర్భిణులను మంచాలపై బీటీ రోడ్డు వరకు తీసుకెళ్లినాం. అనంతరం 108 వాహనంలో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లినాం. తమను పట్టించుకోవాలని పదిహేను రోజుల కింద పీవోను కలిశాం.

– సిడాం లక్ష్మణ్, చిన్ను మారుతి గూడ

చందాలతో వెలుగులు



తమ గ్రామానికి మిషన్ భగీరథ పైపు లైన్ లేదు. తమ గ్రామానికి కొన్ని మీటర్ల దూరంలోని ఊరు నుంచి నల్లా పైపు ద్వారా నీటిని సరఫరా చేసుకుంటున్నాం. ఆ నీళ్లు కూడా వారానికి ఓసారి వస్తే లేవు. నీళ్లు రానప్పుడు అదే ఊరులోని బోరింగ్ నుంచి తెచ్చుకుంటున్నాం.

– సిడాం పద్మలత, చిన్ను మారుతిగూడ

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

కేయూ క్యాంపస్ : తెలంగాణలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 20 (నేటి నుంచి) నుంచి ప్రారంభం కానున్న వివిధ విభాగాల్లోని పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన డీన్లు, విభాగాధిపతులు, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు, ఇతర అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరిన్ని వివరాలకోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు వెల్లడించారు.

మాలీల ఎస్టీ హోదాపై ఏకగ్రీవ తీర్మానం



పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మాలి సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా అంశంపై ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం అభినందనీయమని, ఇక కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని మాలీ జాతీయ సదస్సులో తీర్మానం చేశారన్నారు. అఖిల భారతీయ మాలీ మహా సంఘం 22వ స్థాపన దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన పలువురు మాలీ కులస్తులు పాల్గొన్నారని, జాతీయస్థాయి నేతలంతా సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని సమర్థించారని తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నుంచి సంఘ కార్యకర్తలు సుభాష్ షెండే, మురళీధర్ నాగోష్, గజానంద్ చౌదరి, ధనంజయ ప్రధాన్, వాడగూరే విజయ్, కల్పన పెట్కులే, లక్ష్మి షిండే, అంబాదా పాల్గొన్నారు.

బోథ్‌ను డివిజన్ చేయాలి..



డివిజన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

- డివిజన్ కోసం రాజీనామా చేసిన వార్డు సభ్యురాలు
- కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేను కలిసిన డివిజన్ సాధన సమితి సభ్యులు
- కొనసాగుతున్న దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా చేయాల్సిందేనని బోథ్ డివిజన్ సాధన సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. డివిజన్ సాధనలో భాగంగా బుధవారం మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు కట్ట శిరీష్ వినోద్ రాజీనామా చేశారు. దీక్షా శిబిరంలో రాజీనామాను చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె రాజీనామా పత్రాన్ని అందజేశారు. కొన్నేళ్లుగా డివిజన్‌గా చేయాలని కోరుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె తెలిపారు.

కలెక్టర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు..

ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌లను డివిజన్ సాధన సభ్యులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. 2022లోనే సీసీఎల్ఏకు ప్రతిపాదనలు వెళ్లాయని ఎమ్మెల్యే బాపూరావ్ తెలిపారు. డివిజన్ ఏర్పాటు ప్రభుత్వం పరిశీలనలో ఉందని, త్వరలోనే డివిజన్ ఏర్పాటు అవుతుందని తెలిపారు. అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని కలిశారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయకుండా ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. బోథ్‌లోనే డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు పంపిస్తామని కలెక్టర్ పేర్కొనట్లు సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు.

దీక్షలో కూర్చున్న మర్లపెల్లి గ్రామస్తులు...

డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో చేస్తున్న దీక్షలు బుధవారానికి 3వ రోజుకు చేరుకున్నాయి. మూడవ రోజున మర్లపెల్లి గ్రామస్తులు దీక్ష చేపట్టారు. గురువారం సోషల్ మీడియా క్యాంపును నిర్వహించనున్నారు. రానున్న రోజుల్లో ప్రణాళికలను రూపొందించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు పేర్కొంటున్నారు.

సిడాం శంభు 5వ వర్ధంతిని విజయవంతం చేయండి

- తుడుం దెబ్బ పిలుపు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్‌లోని మత్తడిగూడలో గురువారం జరిగే సిడాం శంభు 5వ వర్ధంతిని జిల్లాలోని ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లోని కుమురంభీం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ అమరజీవి తుడుం దెబ్బ వ్యవస్థాపక సభ్యులు, ఆదివాసీ పోరాట యోధుడు, సమాజం అభివృద్ధి కోసం నిరంతరంగా పోరాడం జరిగిందన్నారు. జల్, జంగల్, జమీన్, స్వయం పరిపాలన, మా ఊళ్లో మా రాజ్యం (మావ నాటే మావ రాజ్) కోసం అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఆదివాసీలకు పోడు భూముల సమస్య నుంచి పరిష్కారం త్వరగా రావాలని కోరుకున్న మొదటి వ్యక్తిని పేర్కొన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు రావాలని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట పలుమార్లు రాస్తారోకో, ధర్నాలు చేశారన్నారు. అలాగే ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధాన శైలిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో తుడుం జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, నాయకులు ఆత్రం బుజంగ్‌రావు, తొడసం ప్రకాష్, దుర్వ లింగు పాల్గొన్నారు.

23న ఆదివాసీ తొమ్మిది తెగల ఐక్యత సమావేశం



మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: ఈ నెల 23న మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆదివాసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ 9 తెగల ఐక్యతపై సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆదివాసీ సంఘాల పెద్దలు తెలిపారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ సమన్వయ కమిటీ అధ్యక్షులు సిడాం భీంరావ్ ఆధ్వర్యంలో 9 తెగల ఆదివాసీల ఐక్యతపై చర్చించనున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లాలోని 9 తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘం, తెలంగాణ గిరిజన సంఘాల నాయకులతో పాటు రాయిసెంటర్ సార్‌మేడిలు, ఆయా గ్రామాల పటేళ్లు, పెద్దలు, ఆదివాసీ కార్మిక, కర్షక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, కనక తుకారం, సార్‌మేడిలు మెస్రం వెంకట్‌రావ్, తుంరం జుగాదిరావ్, నాయకులు మెస్రం నాగ్‌నాథ్, జ్యోతిరాం, తోడసం నాగోరావ్, తోడసం సాగర్ ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి



ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ ఉపాధ్యాయులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం ఉట్నూర్‌లోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, మోడల్ స్పోర్ట్స్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టోర్ రూమ్‌ను పరిశీలించి సరుకులను రికార్డులు ప్రతీ రోజు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వంటగదిలో శుభ్రతను, బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్, సిబ్బందికి సూచించారు. తరగతి గదిలో విద్యార్థులతో సంభాషించి సబ్జెక్టుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. ప్రతీ విద్యార్థిలో అభ్యాస సామర్థ్యాలకు పెంచేలా విద్యా బోధన చేయాలని ఆదేశించారు. అక్షర జ్యోతి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, సబ్జెక్టుల వారిగా బోధన తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుడా పాఠశాలల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐఐటీ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల అందచేత

గిరి విద్యార్థులు ఐఐటీలలో సీట్లు సాధించడం అభినందనీయమని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని బోథ్ మండలం పార్డిపాల్ సింగ్ నాయక్ తండాకు చెందిన ఆడే రూపేష్, నార్నూర్ మండలం సోనాపూర్, ఉమ్రి గ్రామాలకు చెందిన రాథోడ్ నితీశ్, జాదవ్ రాజు, కోటపెల్లి మండలం గొప్పారంకు చెందిన రవికుమార్, బెల్లంపల్లి మండలం తాళ్ల గిరిజన గ్రామానికి చెందిన నిత్యశ్రీలు దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో సీట్లు సాధించారని తెలిపారు. అందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ప్రతిభగల విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

వాగు దాటి వైద్యం



జైత్రంతండా వాగుదాటుతున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: రెండు రోజులుగా మండల కేంద్రంతో పాటు మండలంలోని భారీ వర్షాలు కురువడంతో వాగులో వరదనీరు పొంగిపొర్లుతున్న వైద్య సిబ్బంది వాగులు దాటి గ్రామాలను సందర్శించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. బుధవారం ఇమునైజేషన్ టీకాల కార్యక్రమంతో పాటు ర్యాపిడ్ ఫీవర్ సర్వే ఉండడంతో మండలంలోని జైత్రంతండా, మామిడిగూడ గ్రామస్తుల సాయంతో ఏఎన్ఎం విజయసుందరి, వడగామ్ ఆశ వర్కర్ ఆత్రం అనసూయలు వాగు దాటి గ్రామాలను సందర్శించి రోగులకు వైద్యం అందించారు. చిన్న పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు ఇమునైజేషన్ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడారు. మండలంలోని మామిడిగూడ, జైత్రంతండా గ్రామాలకు రోడ్డులేక, వాగుల వద్ద వంతెనలు లేక వర్షాకాలంలో కష్టమవుతుందని, అయినా వరదనీరు తగ్గిన తరువాత గ్రామాల్లో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని జైజవాన్‌నగర్‌లో బుధవారం పేకాటాడుతున్న నలుగురిని టూటౌన్ సీఐ అశోక్ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మధ్యాహ్న సమయంలో ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మూడు ముక్కలాట ఆడుతూ కనిపించడంతో వారిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.4660 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా చునరి మనోరథ్



శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

భైంసా: బాసర గోదావరి నది వద్ద భైంసాకు చెందిన మార్వాడి మహిళా సంఘం ఆధ్వర్యంలో చునరి మనోరథ్(చీర సమర్పణ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి నది వద్ద ప్రత్యేక పూజలు చేసి, గంగమ్మ నది తల్లికి చీర సమర్పించారు. అలాగే నది ఒడ్డున గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి సంజీవ్ మహారాజ్, భైంసాకు చెందిన మార్వాడి మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన తుల అరుణ్‌కుమార్



మాణిక్‌రావు ఠాక్రే, కోమటిరెడ్డితో అరుణ్‌కుమార్

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన తుల అరుణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. హైదరాబాద్‌లోని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అరుణ్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. గతంలో సుభాష్‌ను మావోయిస్టులు చంపివేయడంతో అప్పుడు వైఎస్సార్ సొనాలకు వచ్చి వారి కుటుంబాన్ని పరామర్శించినట్లు వివరించారు. తన తండ్రి ఆశయ సాధన కోసం తాను పార్టీలో చేరినట్లు అరుణ్ పేర్కొన్నారు.

కట్కం మురళికి డాక్టరేట్



కట్కం మురళి

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్కం మురళికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కోటలు, గడీలు' అనే అంశంపై పీహెచ్‌డీ పరిశోధనను పూర్తి చేశారు.